క్లుప్తంగా

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: సాంఘిక సంక్షేమ గురుకుల, గిరిజన సంక్షేమ, వెనకబడిన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వినోద్‌సాధ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 11న నిర్వహించే ప్రవేశ పరీక్షకు రూ. 100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సమీపంలో గురుకుల పాఠశాల లేదా, కళాశాల్లో సంప్రదించాలని కోరారు.

పార్లమెంట్ ముట్టడిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు



పార్లమెంట్ ముట్టడిలో పాల్గొన్న నాయకులు

కైలాస్‌నగర్/నేరడిగొండ: పార్లమెంట్‌లో కాంగ్రెస్, విపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్, అసెంబ్లీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్భాత్ ఖాన్, సామ రూపేష్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు పోతారెడ్డి పాల్గొన్నారు. పార్లమెంట్ వద్ద చేపట్టిన ఆందోళనలో పాల్గొని, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

తలమడుగు: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన విట్టల రుక్మిణిబాయి ఆలయంలో విఠలా రుక్మిణిబాయి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. విఠలా రుక్మిణిబాయి విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. లక్ష్మింపూర్, సుంకిడి, తలమడుగు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, సర్పంచ్ మోహిత ప్రభా దేవురావు, ప్రభాకర్, సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1నుంచి ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

జైనథ్: జనవరి 1 నుంచి ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్నట్లు హిందూ స్వయం సేవక్ సంఘ్ నాయకులు, ఎన్ఆర్ఐ నవనీత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని నిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జనవరి 1 నుంచి 21 వరకు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలు చేరవేయాలన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, భజనలు చేస్తూ, అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులకు అక్షింతలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, కర సేవక్‌లు సంద పోశెట్టి, శ్రీనివాస్, భోయర్ విజయ్, చంద్రకాంత్ చౌదరి, ప్రభాకర్, రాందాస్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వందేళ్ల కిందటే స్వచ్ఛభారత్

ఎదులాపురం: స్వచ్ఛ భారత్ కాన్సెప్ట్ ఇప్పటిది కాదని, వందేళ్ల కిందటే అలాంటి కార్యక్రమాన్ని సామాజిక పోరాట యోధులు సంత్ గాడ్గే బాబా మహరాజ్ ఆచరించి చూపారని రజక సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు కొండ్రంటు రాజేశ్వర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రజక సంఘ భవనంలో బుధవారం సంత్‌గాడ్గే బాబా 67వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలను చైతన్య పర్చి, భక్తి, సేవా మార్గాలను చూపించిన మార్గదర్శి అని కొనియాడారు. సంతోశ్, నరేందర్, స్వామి, దేవిదాస్, శివదాస్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకంలో మార్పులు చేయాలి

బోథ్: మహాలక్ష్మి పథకంలో మార్పులు చేయాలని ధర్మసమాజ్ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డులు ఉన్న వారికే మాత్రమే ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించాలన్నారు. దీనివల్ల పేదవారికి లబ్ధిచేకూరుతుందన్నారు. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం వల్ల ఆటోడ్రైవర్లపై ప్రభావం పడుతోందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేశ్, రఘువీర్, కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు నివాళి

తాంసి: భీంపూర్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జమున నారాయణ రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురై ఆస్పత్రిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా బుధవారం తహసీల్దార్ మృతికి సంతాపంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నారాయణ చిత్రపటానికి ఉద్యోగులు నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్, భీంపూర్ సర్పంచ్ లింబాజీ, జూనియర్ అసిస్టెంట్ ప్రేంకుమార్, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రెండేళ్లుగా నిరీక్షణ..

- విడుదల కాని విద్యార్థుల రవాణా చార్జీలు
- పట్టించుకోని అధికారులు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: ఇతర గ్రామానికి వెళ్లి ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఆయా విద్యా సంవత్సరంలో రవాణా చార్జీలు చెల్లిస్తోంది. రవాణా చార్జీలకు సంబంధించి నిధులు రెండేళ్ల నుంచి విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. మండలంలో 87 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా ప్రభుత్వ పాఠశాలలో ఒక గ్రామం నుంచి మరొ గ్రామానికి వాహనాల్లో తరలి వెళ్లి చదువుకునే వారికి నెలకు రూ. 300 అందజేస్తారు.

మండలంలో 301 మంది..

వారి గ్రామం నుంచి 3 కిలో మీటర్ల దూరం వెళ్లి ఇతర పాఠశాలలో చదువుకునే వారు ఆదిలాబాద్ రూరల్ మండలంలో 301 మంది విద్యార్థులు ఉన్నారు. వారు రవాణా చార్జీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2022–23, 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు రవాణా చార్జీలకు సంబంధించిన నిధులు విడుదల కాలేదు. అసలు ఆ నిధులు ఇస్తారో? లేదో? తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 1.80 లక్షలు పెండింగ్..

విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో చదువులు మానేయకుండా ఉండేందుకు ఉన్నత చదువులు చదువాలనే ఉద్దేశంతో వారి గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు నెలకు ప్రభుత్వం రూ. 300 చొప్పున ఒక్కొక్కరి రవాణా చార్జీ చెల్లిస్తోంది. రెండు విద్యా సంవత్సరాలు కలిపి మొత్తం సుమారు రూ. 1.80 లక్షల వరకు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఎప్పు డు ఇస్తారోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

ఖాతాలోనే జమ



వారి గ్రామంలో ఉన్నత పాఠశాల లేకపోతే మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వాహనాలలో వెళ్లేందుకు ప్రభుత్వం నెలకు రూ. 300 రవాణా చార్జీని అందజేస్తోంది. రెండేళ్ల నుంచి రవాణా చార్జీలకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం వాటిని విడుదల చేయగానే నేరుగా వారి ఖాతాలో జమ అవుతాయి.

– జయశీల, ఎంఈవో, ఆదిలాబాద్ రూరల్

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

ఇంద్రవెల్లి: రైతుబంధు డబ్బులను ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రైతులతో కలిసి మాట్లాడారు. వానాకాలంలో సాగు చేసిన పంటలు అతివృష్టి.. అనావృష్టితో రైతులు నష్టపోయారని, యాసంగిలో పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం కొద్ది మంది రైతులకే చెల్లించిందన్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా.. ఇంకా రైతుబంధు సాయం అందకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు చిరంజీవి, మెస్రం గోదిరావ్, రాంనివాస్, జైరాం, హరిరాం పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న కృష్ణవేణి

ఎదలాపురం: మహిళల రక్షణకు ప్రతిఒక్కరూ పాటపడాలని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. పట్టణంలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళా సాధికారత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా.. ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలపై అత్యాచారాలు జరగకుండా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని రంగాలలో ప్రతిభ చాటుతూ సాధికారత దిశగా మహిళలు ముందుకు సాగాలని సూచించారు. ఇందులో జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ శోభ, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నేడు వినియోగదారులకు అవగాహన

ఎదులాపురం: ఈనెల 24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యానగర్‌లోని ఆదిత్య కళాశాలలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈ సమావేశంలో 2019 వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఉట్నూర్‌రూరల్: ఈనెల 22న ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తిరుమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు నివేదికలతో హాజరుకావాలని కోరారు.

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ బుధవారం తెలిపారు. సమావేశానికి జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే కోవ లక్ష్మిలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

24 నుంచి క్రిస్మస్ వేడుకలు

ఎదులాపురం: ఈనెల 24రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమవుతాయని జిల్లా కేంద్రంలోని హోలీ ఫ్యామిలీ క్యాథలిక్ చర్చ్ ఫాదర్ అజ్జు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగులు, అధికారుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు, అధికారులు

ఎదులాపురం: భారతీయ జీవిత బీమా సంస్థ యాజమాన్య ఏకపక్ష వైఖరిని వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని శాఖ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగుల, అధికారులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ జాయింట్ ఫ్రంట్ ఆదిలాబాద్‌శాఖ కన్వీనర్ దౌలత్ రావు మాట్లాడుతూ.. ఉద్యోగుల వేతన సవరణ చర్చలు వెంటనే ప్రారంభించాలన్నారు. నూతన పెన్షన్ పథకం కవర్ అవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కాంట్రిబ్యూషన్ 10 నుంచి 14 శాతానికి పెంచాలన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు క్రిష్ణ, శ్యాంరావు, అశోక్ కుమార్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, భాస్కర్, రవికిరణ్, వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు గణేష్, నసీరుద్దీన్, నీలానంద్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బోథ్: మార్కెట్ ఆదాయానికి గండికొడుతూ అక్రమంగా వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బోథ్ మార్కెట్ పాలకవర్గం డిమాండ్ చేసింది. బుధవారం మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ సోలంకి రుక్మణ్‌సింగ్ ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, కార్యదర్శి దేవన్న, కత్తూరి మల్లేష్, కత్తూరి విశ్వానంద్, కదం ప్రశాంత్, సర్పంచ్ సురేందర్ యాదవ్, సూపర్‌వైజర్ స్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పుస్తకాలు పంపిణీ

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రివ పుస్తక మిత్ర సంస్థ రూ. 40వేల విలువ గల 1500 పుస్తకాలు అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ తెలిపారు. బుధవారం పాఠశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పసుల ప్రశాంత్ హాజరై, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాములు, కామ్రే మనోజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో రూ. 4 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించే డ్రెయినేజీ పనులను బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, ఎంపీటీసీ రాజమణి మహిపాల్, మాజీ సర్పంచ్ దివాకర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో రిటైర్డ్ మండల విద్యాధికారి కౌసల్య బుధవారం అన్నదానం చేశారు. ఆమె మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. రానున్న రోజుల్లో మరింత సహకారం అందిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి పెంటపర్తి ఊశన్న, వృద్ధాశ్రమ నిర్వాహకులు సతీష్, నర్సింలు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆడే గజేందర్‌ను కలిసిన నాయకులు

నేరడిగొండ: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆడే గజేందర్ మాట్లాడుతూ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సమస్యలను విన్నవిస్తానని హామీ ఇచ్చారు.

బాలల హక్కులు కాపాడాలి



విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న సభ్యులు

తాంసి: బాలల హక్కులను ప్రతిఒక్కరూ కాపాడాలని మహిత సంస్థ కోఆర్డినేటర్ ఇమ్రాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పాఠశాలలో మహిత స్వచ్ఛంద సంస్థ తరపున బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలల హక్కులను విద్యార్థులకు తెలియజేసి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్, కేజీబీవీ అధికారి సౌజన్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుజాత, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అభిషేకం చేస్తున్న అయ్యప్పస్వాములు

తాంసి: మండల కేంద్రంలోని కళాశాల మైదానంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. నారికేళ స్వామి సోమ నరేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. మొదటగా గణపతి, అయ్యప్ప స్వామి, సుబ్రమణ్య స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం పాలు, పెరుగు, నెయ్యి, పండ్లతో పాటు పంచామృతాలతో అభిషేకం చేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివానంద తంత్రి స్వామి వేడినూనెలో నుంచి స్వాముల చేత బజ్జీలు తీయించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు సంతోష్, శ్రీనివాస్, కృష్ణ, దీలీప్, పోచ్చారెడ్డి, వినోద్, భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

బోథ్: మండలంలోని వజ్జర్, చింతలబోరి, పార్డి(కె), సొనాల, కోట(కె) గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సుభాష్ చందర్ బుధవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులను పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

- మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్

ఆదిలాబాద్: వినాయక్ చౌక్ కూడలిని కూల్చివేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులను ఆదేశించడం సరికాదని మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కౌన్సిల్‌లో రచించిన అనంతరం ప్రతిపాదనలను చేసిన తర్వాతనే పట్టణ సుందరీకరణకు సంబంధించి కూడళ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే రూ. కోట్ల నిధులు వెచ్చించి వినాయక చౌక్ ఆధునీకరణ చేపట్టామన్నారు. అయితే ఇటీవల జరిగిన మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వినాయక చౌక్‌ను కూల్చివేయాలంటూ అధికారులతో వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పాలకవర్గం ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణకు ఎంతగానో కృషి చేసిందన్నారు. ప్రజాధనాన్ని వృథా చేసేలా నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు బండారి సతీష్, భరత్, రాజు, సంద నర్సింగ్, పందిరి భూమన్న, అశోక్ స్వామి, రాము, సృజన్ రెడ్డి, సాయి ప్రణయ్, లక్ష్మణ్, లస్మన్న, రామేశ్వర్, ఇమ్రాన్, ఐమద్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు విన్నవించిన రమాయినగర్ గ్రామస్తులు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట పరిధిలోని రమాయినగర్ గ్రామ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు బుధవారం ఉట్నూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. 2005లో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో 18 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, కాని ఇప్పటి వరకు తమ గ్రామం ఏ గ్రామపంచాయతీలో నమోదు చేయకపోవడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రమాయినగర్ గ్రామాన్ని ఏమాయికుంట గ్రామ పంచాయతీలో నమోదు చేయించి ఇంటి పన్ను వసూలు చేయించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమాయినగర్ గ్రామస్తులు విక్రమ్, మదోవ్, చంద్రశేఖర్, విజయ్, అనిత, రేణుక పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



నార్నూర్: మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు



ఉట్నూర్‌రూరల్: నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల న్యాయం చేయాలని ఆటో యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు గాయక్‌వాడ్ భారత్, మండల అధ్యక్షుడు తిట్టె సాగర్‌లు డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆటోలను ఏ గ్రామానికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలను ఆటోల నుంచి దింపేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. నెల నెల కిస్తీలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల ఉపాధ్యక్షుడు జాదవ్ లక్ష్మణ్, ఆటో డ్రైవర్లు నాందేవ్, గిల్బే భారత్, సోహెల్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ఆటో యూనియన్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు దావుల రమేశ్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో ఆటోలకు కిరాయి దొరకక ఇబ్బంది పడుతున్నామని, దీంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ఇంద్రవెల్లి: మహిళలతో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

నార్నూర్: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం డివిజన్ స్థాయిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటోలు బంద్ నిర్వహించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పథకంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రాథోడ్ సకారం, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సవాయిసింగ్

బేల: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సవాయి సింగ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీఎల్‌వోలకు ఓటరు నమోదు, సవరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఓటరు నమోదు, ఫారం– 6, ఫారం– 8లపై అవగాహన కల్పించారు. ఓటరు గుర్తింపు కార్డు ఉండి జాబితాలో పేరు లేని దరఖాస్తు, ఏమైనా చేర్పులు, మార్పులపై పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, ఆర్ఐలు గీత, సాజిద్ పాల్గొన్నారు.